# చక్రభ్రమణం

ఆ సాయంత్రం సీతారాం గారింట్లో పార్టీ. ఏడు గంటలకల్లా రమ్మంటే, అందరూ ఎనిమిది గంటలకే వచ్చేశారు ఎంత అమెరికాలోవున్నా తెలుగువాళ్ళు కదా మరి. మన తెలుగుతనం ఆ మాత్రమైనా పాటించకపోతే ఎలా.

పార్టీలకి వెళ్ళినప్పుడల్లా గుర్తుకివస్తుంది అహో ఆంధ్రభోజా అనే మంచి మనసులు సినిమాలో ఘంటసాల పాడిన పాట. ఒక పక్క అమెరికా గొప్పదా ఇండియా గొప్పదా అనే యుద్ధభేరీలు, ఒక పక్క ఉల్లాస మొనరించు ఆస్థాన విద్వాంసుల గానాలు, ఒక పక్క నగచీరాదుల విన్యాసాలు, ఒక పక్క స్టాక్ మార్కెట్ ఉపన్యాసాలు ఒక పక్క డాన్స్ నేర్చుకునే పిల్లల కూచిపూడి ముద్రలు ఇంకొక పక్క సోఫానే పక్క అనుకుని పక్కవాడిని ఆనుకుని ఆనందించే గురక నిద్రలూ, ఆకలేస్తున్నదని కలత పడవలదు.. నేను బల్ల మీద వేడి వేడి పదార్థాలు సర్దుతున్నాననే అన్నదాత చల్లచల్లని మాటలకోసం ఎదురు చూసే తిన్నదాతలూ ఎప్పుడూ అదే మెన్యూలో వుండే మెక్డొనాల్డ్ ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్‌లా ఎప్పుడూ ఇవే విశేషాలతో అదే విధంగా వుంటాయి అమెరికాలో మనవాళ్ళ పార్టీలు.

అక్కడ పెట్టిన స్నాక్ తినేసి, నాకు ఆ ఏ టాపిక్స్‌లోనూ కొత్త విశేషాలు ఏమీ కనపడకపోవటంతో, లేచి అలా అలా తిరుగుతూ, పక్కనే వున్న సీతారాం ఆఫీసు గదిలోకి వచ్చాను. ఆయన గది చక్కగా నీటుగావుంటుంది. అప్పటికే గోపాల్‌కూడా అక్కడికి వచ్చి, అక్కడ గోడ మీదవున్న ఒక ఛార్ట్ చూస్తున్నాడు. నన్ను చూసి - "ఇది చూశారా. ఎంత బాగుందో!" అన్నాడు.

అది ఒక గ్రాఫ్‌లాగా వుంది. ఎక్స్ యాక్సిస్ మీద వయసు, వై యాక్సిస్ మీద దానికి తగ్గ నోట్స్ వ్రాసి వుంది.

"ఇది ఎవరు తయారు చేశారో కానీ, చాలమందిలో నూటికి నూరుపాళ్ళు నిజం!" అన్నాడు గోపాల్.

అతనామాట అన్నాక ఇంకా దీక్షగా చూశాను. అమెరికాలో పెరుగుతున్న పిల్లల జీవితాల గురించి. వయసుతోపాటూ మారుతున్న వారి అభిప్రాయాల గురించి. పిల్లాడు పుట్టినప్పటినించీ, పెరుగుతున్నకొద్దీ తన అభిప్రాయాలు -ముఖ్యంగా వారి తండ్రితోనూ, తండ్రి అభిప్రాయాలతోనూ ఎలా పోల్చుకుంటారో చెప్పే ఛార్టు అది.

"ఇది ఇంతకు ముందు ఇక్కడే సీతారాంగారింట్లో చూశాను. తర్వాత దీని గురించి రీశెర్చి కూడా చేశాను. ఇదేదో సరదాగా చేసింది కాదు. ఎన్నో

స్టాటిస్టిక్స్ తీసుకుని, వాటిని పరిశీలించి చూసిన ఫలితమిది"

నేను నవ్వాను. "మీకు స్టాటిస్టీషియన్ అంటే డెఫినిషన్ తెలుసా. ఒకతనికి కాళ్ళు కుంపట్లోనూ తల ఫ్రీజర్‌లోనూ పెడితే, సగటున (అంటే యావరేజ్ టెంపరేచర్ చూసుకుంటే) ఎంతో హాయిగా వున్నాడు అని అనేవాడు ఆ గణాంక నాధుడు.. గణనాధుడు"

గోపాల్ కూడా నవ్వాడు, "అవును. నేనూ విన్నాను ఆ జోక్‌ని. కానీ ఈ గ్రాఫ్‌లో ఎంతో నిజంవుంది. మా అబ్బాయి విషయంలో అక్కడ ఎలా వ్రాసి వుందో అచ్చం అదేరకంగా జరిగింది!" అన్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యంతో పాటూ, ఎంతో కుతూహలం కూడా కలిగింది. పరుల విషయాలు పరమాన్నంకన్నా రుచిగావుంటాయి కదా మరి. అదీకాక ఇంకా భోజనాలకి పిలుపులు కూడా రాలేదు. కనుక ఆయన్ని అడిగాను "అయితే ఆ కథేమిటో చెప్పండి, తెలుసుకోవాలని వుంది" అని. అంటూనే అక్కడ వున్న కుర్చీలో కూర్చున్నాను, వినటానికి నేను సిద్ధం అనే సంకేతం ఇస్తూ.

గోపాల్ టీచర్‌లాగా ఆ ఛార్టుని చూపిస్తూ, చెప్పటం ప్రారంభించాడు. "ఇది చూశారా? పన్నెండేళ్ళ వయసు వచ్చేదాకా అన్నమాట. తన తండ్రి చాల తెలివిగలవాడనీ, గొప్పవాడనీ, ఆయనికి తెలియని విషయాలు ఈ భూప్రపంచంలో ఏమీ వుండవనీ అనుకుంటాడుట కొడుకు. పదమూడో ఏడు వచ్చేసరికీ టీనేజర్ అయిపోతాడు. అప్పటినించీ అతని అభిప్రాయం మారుతూ వుంటుంది. మా నాన్నకి అన్నీ తెలియవు, కొన్నే తెలుసు అనుకోటంతో మారిన అభిప్రాయం, వయసు పెరుగుతున్న కొద్దీ త్వరత్వరగా మారిపోతుంది. పదిహేడేళ్ళు వచ్చేసరికీ. మా నాన్నకేమీ తెలీదు అనుకోవటం, పంథొమ్మిది ఏళ్ళు వచ్చేసరికీ మా నాన్న, అసలు ఈ చాదస్తుడు, ఈ ప్రపంచంలో ఎలా బ్రతకగలిగాడా అని ఆశ్చర్యంగా వుంది అనుకోటమే కాకుండా, పైకి అనే దాకా వస్తుంది. ఇక్కడ చూడండి. వయసు ఇరవై మూడూ ఇరవై నాలుగు వచ్చేసరికీ, ఆ కుర్రాడే తన తండ్రిని ఉద్యోగపరంగా మొట్టమొదటి సలహా అడుగుతాడు.అప్పటినించీ మళ్ళీ మంచీచెడూ అన్నీ తండ్రితో చర్చిస్తాడు. తీరా తన యాభయ్యో సంవత్సరంలోనో తర్వాతనో తండ్రి చనిపోయాక, అతని ఆలోచనలు ఇంకో రూపం దాల్చుతాయిట. ఏదన్నా క్లిష్టమైన సమస్య వచ్చినప్పుడు, ఇదే సమస్య మా నాన్నకి వచ్చివుంటే ఎలా చేసేవాడు అని ఆలోచిస్తాడుట" గోపాల్ సాలోచనగా చెప్పటం ఆపాడు. నేనూ చెప్పిన విషయాలు జాగ్రత్తగా ఆకళింపు చేసుకుంటున్నాను.

ఒక్క క్షణం ఆగి అన్నాను, "అవును. మన చుట్టూ పెరుగుతున్న పిల్లల్ని చూస్తున్నాం కదా. అలాగే వుంది ఈ వాదన"

తనూ ఒక్కక్షణం ఆగి అన్నాడు "మా అబ్బాయి విషయంలో అచ్చం ఇదిలాగే జరిగింది. అందుకే మొదటిసారి ఈ ఛార్టు చూడగానే ఆశ్చర్యపోయాను. మావాడు నాగురించి ఎంతో గొప్పగా మాట్లాడేవాడు. తన స్నేహితులతో కూడా అనేవాడు, మీకేమీ తెలియకపోతే మా నాన్నని అడుగుదాం. హి నోస్

ఎవ్విరిథింగ్ అని. తర్వాత నేను మావాడి హోం వర్క్‌లో సహాయం చేద్దామని అనుకుంటే నవ్వేవాడు, నీకేం తెలుసు నాన్నా. మీరు బట్టీపట్టి చదివేవాళ్ళు. అసలు ఈ సిస్టమే వేరు అనేవాడు. ఇంజనీరింగ్ చదువుతానంటే, మెకానికల్ ఇంజనీరింగ్ చదువు బాగుంటుంది అన్నాను. మెకానికల్ ఇంజనీరింగా! నీలాగానా! చూస్తున్నాంగా నువ్వెలా వున్నావో.. మళ్ళీ నేను కూడా నీలా తయారవటం ఎందుకు? వద్దులే... అనిఎగతాళి చేసేవాడు. మా ఆవిడ అది భరించలేక, నాన్నకి ఆ మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ వల్లే కదురా... ఇంత మంచి ఉద్యోగం వచ్చింది. మన ఇల్లూ, మూడుకార్లూ అన్నీ ఆ ఉద్యోగం వల్లే కదూ... అంది కూడానూ వాళ్ళమ్మతో వాదించడు వాడు. అందుకనే, నవ్వి వూరుకునేవాడు" ఆగాడు.

నేనూ చిన్నగా నవ్వి - "బాగుంది. వినటానికి చాల సరదాగా వుంది" అన్నాను.

గోపాల్‌కూడా నవ్వి, "కొన్నాళ్ళాగండి. మీవాడూ ఆ చక్రభ్రమణంలో ఎక్కుకుని మీకు చిక్కులు తెస్తుంటే తెలుస్తుంది"

అతను సరదాగా అన్నాడో, శాపం పెట్టాడో అర్థంకాక అర్థం కానట్టూ ముఖం పెట్టి, అదోలా చూశానతన్ని. అతను మళ్ళీ నవ్వి, "మా వాడికి డిగ్రీ కాగానే బాస్టన్‌లో ఉద్యోగం వచ్చింది - మీకు తెలుసు కదూ" అన్నాడు.

అవునని తల వూపాను.

"ఆ ఉద్యోగంలో చేరిన, నెలరోజులకే నా సలహా కోసం ఫోన్ చేశాడు. తనకి హార్డ్‌వేర్ డిజైన్ అంటే చాల ఇష్టం ఆ ఉద్యోగంలో అది చేయటానికే చేరాడు. కానీ ఆ కంపెనీలో పరిస్థితులు మారటం చేత, వాళ్ళు ఆ హార్డ్‌వేర్ డివిజన్ని మూసేస్తున్నారు. మావాడిని సాఫ్ట్‌వేర్ డిజైన్లో చేరమనీ, అది ఇష్టం లేకపోతే కథ కాలరాడోకి, నువ్వు ఇంటికీ వెళ్ళిపోవచ్చునన్నారుట. తను ఆ విషయంలో రకరకాలుగా ఆలోచిస్తున్నాననీ నిర్ధారణగా ఏమీ తేలటం లేదనీ, నా సలహా కావాలనీ అడిగాడు అప్పుడు మా వాడి వయసెంతో తెలుసా? ఇరవై మూడు. అంటే ఈ ఛార్టులో ఏముందో సరిగ్గా అలాగే జరిగిందన్నమాట. అఫ్ కోర్స్ నేనిచ్చిన సలహా మావాడి ఆలోచనా ఒకటే అవటంతో ఈ కథని కాలరాడో పంపించకుండా తనతో పాటూ కాలిఫోర్నియా తీసుకువెళ్ళాడు. అప్పటినించీ అక్కడే తనకి ఇష్టమైన హార్డ్‌వేర్ డిజైన్లో ఉద్యోగం చేస్తున్నాడు"

ఆయనకి నచ్చిన ఆ ఛార్టు వేపు మరోసారి చూస్తుండగా, భోజనం తయారు అన్న కబురు చెవిని పడింది.

వారానికి ఐదు రోజులు కష్టపడి పని చేయటం, వారాంతాలలో ఇలాటి కబుర్లు చెప్పుకోవటం

ఇదీ ఒక చక్రభ్రమణమే మరి!

ఆయనతో పాటూ, నేనూ డైనింగ్ టేబుల్ వేపు నడిచాను.

* * *